ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 12 జనవరి 2024



ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో అధికార పార్టీ ఆరుచోట్ల ఇంఛార్జులను మార్చింది. వైసీపీ గురువారం రాత్రి విడుదల చేసిన మూడో జాబితా మేరకు ఆరుగురు సిట్టింగులకు టికెట్లు గల్లంతైనా అందులో ముగ్గురికి పార్టీ అధిష్ఠానం ప్రత్యామ్నాయం చూపింది. తిరుపతి ఎంపీ గురుమూర్తి సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గానికి బదిలీ కాగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరుపతి పార్లమెంటుకు బదిలీ అయ్యారు. చిత్తూరు సిట్టింగు ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు రాజ్యసభ స్థానానికి బదిలీ అయ్యారు. ఈ ముగ్గురినీ మినహాయిస్తే గూడూరులో వరప్రసాదరావు, పూతలపట్టులో ఎంఎస్ బాబు, మదనపల్లెలో నవాజ్ బాషాలకు టికెట్లు గల్లంతయ్యాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆరుచోట్ల వైసీపీకి కొత్త ఇన్‌ఛార్జులొచ్చారు!

ఐదు స్థానాల్లో తప్పని అంతర్గత సంక్షోభం

తిరుపతి ఎంపీ, సత్యవేడు ఎమ్మెల్యే పరస్పర బదిలీ


గురుమూర్తి - ఆదిమూలం

తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి సత్యవేడు ఇంఛార్జిగా బదిలీ అయ్యారు. రానున్న ఎన్నికల్లో తిరుపతి నుంచీ మళ్ళీ ఎంపీగా పోటీ చేయడానికే ఆయన మొగ్గు చూపుతున్నారు. పెద్దగా శ్రమ, ఖర్చు లేకుండా ఎంపీగా గెలిచే అవకాశముంటుందని ఆయన భావిస్తున్నట్టు సమాచారం. దానికి తోడు సత్యవేడు టీడీపీకి కంచుకోట కావడం, అక్కడి నుంచీ గెలుపు కష్టసాధ్యమని గ్రహించడంతో ఎంపీ పదవి వైపే ఆయన మనసు లాగుతోందని సమాచారం. అయితే అధిష్ఠానం ఆదేశంతో అయిష్టంగానే సత్యవేడుకు వెళ్ళేందుకు అంగీకరించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అదే సమయంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సైతం అక్కడే మళ్ళీ పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. కానీ నియోజవకర్గంలో వ్యతిరేకవర్గం బలంగా వుండి టికెట్‌కు అడ్డుపడడంతో బదిలీ తప్పలేదు. ఆయన కూడా అయిష్టంగా, అసంతృప్తిగా తిరుపతి పార్లమెంటు అభ్యర్థిత్వానికి ఒప్పుకున్నట్టు ఎమ్మెల్యే సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఇష్టం లేని చోట్ల పోటీ ఈ ఇద్దరికీ చేదు అనుభవాన్నే మిగుల్చుతాయేమోనన్న భయాందోళన వారి సన్నిహిత వర్గాల్లో వ్యక్తమవుతుండడం గమనార్హం.

ముగ్గురు ఎమ్మెల్యేలకు టికెట్ల గల్లంతు


వరప్రసాదరావు - మేరిగ మురళీధర రావు


ఎంఎస్ బాబు - సునీల్‌కుమార్

గూడూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావుకు టికెట్ గల్లంతైంది. ఆయన రిటైర్డు ఐఏఎస్ అధికారి కావడంతో రాజకీయాల్లో ప్రజలకు, కార్యకర్తలకు చేరువ కాకుండా ఓ గిరి గీసుకుని అందులోనే వుండిపోయారు. దీంతో సొంత వర్గమంటూ లేకుండా పోయింది. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర రావు సీఎం జగన్‌కు సన్నిహితుడైన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మద్దతుతో ఇంఛార్జిగా నియమితులైనట్టు సమాచారం. నేదురుమల్లి, నల్లపురెడ్డి వర్గాలు ఇప్పటికీ గూడూరులో ఎంతోకొంతమేర ప్రభావం చూపుతున్నాయి. ఈ రెండు వర్గాల మద్దతు మురళీధరరావుకు లభించనుంది. కాకపోతే ఈ రెండు వర్గాల కంటే కూడా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి వర్గం ఇక్కడ బలంగావుంది. ఆ వర్గం మురళీని వ్యతిరేకిస్తోంది. అధిష్ఠానం అతడికే ప్రాధాన్యత ఇవ్వడంతో పేర్నాటి వర్గం మిన్నకుండిపోయింది.ఎన్నికల్లో మురళీ విజయానికి ఈవర్గం పని చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఆ రకంగా చూస్తే వరప్రసాదరావును మార్చడం వల్ల వైసీపీకి ఇక్కడ నష్టమే తప్ప లబ్ధి కలిగే పరిస్థితి లేదనే చెప్పాలి. పూతలపట్టు విషయానికొస్తే సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు అధిష్ఠానం మొండిచేయి చూపింది. గత ఎన్నికల్లో వద్దనుకున్న డాక్టర్ ముత్తిరేవుల సునీల్‌కుమార్ ఇపుడు ముద్దయ్యారు. ఎంఎస్ బాబుకు నియోజకవర్గంలోని ప్రతి దళితవాడలోనూ సొంత వర్గం ఏర్పడింది. ఇపుడా వర్గం సునీల్‌కుమార్ గెలుపుకోసం పనిచేసే అవకాశాల్లేవు. దానికి తోడు ఎంఎస్ బాబు కోసం గట్టిగా పోరాడిన నలుగురైదుగురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన నాయకులు అధిష్ఠానం తీరుతో అసంతృప్తితో అలిగి దూరంగా వున్నట్టు సమాచారం. వీరు చేతులెత్తేస్తే పార్టీ మునిగిపోయినట్టేనన్న ప్రచారం జరుగుతోంది. అలాగే మదనపల్లెలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు అధిష్ఠానం రిక్త హస్తం చూపింది. ఆయన్ను కాదని అసలు రాజకీయాలతో సంబంధమే లేని నిషార్ అహ్మద్‌కు అవకాశమిచ్చింది. దీంతో నవాజ్ బాషా వర్గం ఎన్నికల్లో పనిచేసే వాతావరణం కనిపించడం లేదు. ఇదివరకూ ఇక్కడ మైనారిటీ ఓటర్లు మూకుమ్మడిగా వైసీపీకి మద్దతిచ్చారు. దానికి తోడు మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా టీడీపీలో చేరడంతో మైనారిటీ ఓటర్లలో గణనీయమైన చీలిక ఏర్పడే అవకాశాలేర్పడ్డాయి.


నవాజ్‌బాషా - నిస్సార్ అహ్మద్

ఆరణికి రాజ్యసభ ఖరారైనా....


ఆరణి శ్రీనివాసులు - విజయానందరెడ్డి

చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కూడా టికెట్ గల్లంతైంది. అయితే ఆయనకు రానున్న రాజ్యసభ ఎన్నికల్లో అవకాశం కల్పించేందుకు అధిష్ఠానం నిర్ణయించిందని, ఇక ప్రకటించడమే మిగిలిందన్న ప్రచారం నడుస్తోంది. నిజానికి రాజ్యసభ అవకాశం కల్పించడం శ్రీనివాసులుకు పదోన్నతి కల్పించినట్టే. చిత్తూరులో పోటీ చేసినా గెలుస్తామో లేదో తెలియని స్థితిలో రాజ్యసభ సభ్యత్వం దక్కే అవకాశాలేర్పడడం ఆయనకు అదృష్టమనే చెప్పాలి. కాకపోతే ఎంపీగా ఎన్నికైనా కూడా చిత్తూరు సెగ్మెంట్‌లో పార్టీ అభ్యర్థి గెలుపుకోసం సహకరిస్తారా అన్నది అనుమానంగానే వుంది. దానికి తోడు శ్రీనివాసులును అసెంబ్లీ బరి నుంచీ తప్పించడం పట్ల చిత్తూరు నియోజకవర్గంలో గణనీయంగా వున్న బలిజ సామాజికవర్గం తీవ్ర అసంతృప్తితో వుంది. దాదాపుగా ఆ సామాజికవర్గమంతా వైసీపీకి మద్దతివ్వరాదని అంతర్గతంగా సమావేశాలు పెట్టుకుని మరీ తీర్మానాలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక వైసీపీ ఇంఛార్జి విషయానికొస్తే ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యం ఆయన గెలుపుకు అవరోధం కానుంది. పీడీ యాక్టు కింద అరెస్టయి జైలులో గడిపి వచ్చిన నేపథ్యం విద్యావంతులపై ప్రభావం చూపే అవకాశముంది. అంతే కాకుండా వెన్నంటి వుండే అనుచరవర్గం పట్ల నియోజకవర్గ ప్రజల్లో దౌర్జన్యకర శక్తులనే ముద్ర పడింది. ఇవన్నీ పార్టీ విజయానికి ప్రతిబంధకం కానున్నాయనే ప్రచారం జరుగుతోంది.

పెరగనున్న అంతర్గత విభేదాలు

మొత్తం మీద అధికార పార్టీ గురువారం విడుదల చేసిన మూడవ జాబితాతో అంతర్గత సంక్షోభం నెలకొంది. సత్యవేడు, గూడూరు, చిత్తూరు, పూతలపట్టు, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సిట్టింగులను పక్కనపెట్టి కొత్తవారిని ఇంచార్జులుగా నియమించడం వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు, కుమ్ములాటలు మరింతగా పెరగనున్నాయి. సిట్టింగు ఎమ్మెల్యేలు, వారి వర్గాలు కొత్త వారి గెలుపుకోసం సహకరించే అవకాశాలు దాదాపుగా లేవనే చెప్పాలి. ఎన్నికలు సమీపించేకొద్దీ ఈ వర్గాల నడుమ అగాధం మరింతగా పెరిగి మరింత సంక్షోభానికి దారి తీసే ప్రమాదమూ లేకపోలేదు.

సూళ్ళూరుపేటలో కిలివేటికి లైన్ క్లియర్ !



తడ, జనవరి 11: సూళ్లూరుపేట సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు వచ్చే ఎన్నికల్లో టికెట్ విషయమై వైసీపీ అధిష్ఠానం లైన్ క్లియర్ చేసినట్టు సమాచారం. ఈ మేరకు గురువారం ఆయన నియోజకవర్గవ్యాప్తంగా అనుచరులతో కలసి తాడేపల్లి వెళ్ళి అధినేత జగన్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపినట్టు సమాచారం. అయితే పార్టీ అధికారికంగా దీనిపై ప్రకటన చేయలేదు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనుకూల, వ్యతిరేక వర్గాలుగా వైసీపీ చీలిపోయి పోటాపోటీ కార్యకలాపాలు సాగించిన సంగతి తెలిసిందే. ఆయన వ్యతిరేక వర్గం పలు దఫాలు సీఎం జగన్‌ను కలసి కిలివేటికి మళ్ళీ టికెట్ ఇవ్వవద్దని కోరిన విషయం తెలియంది కాదు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఈ రెండు వర్గాలను సమన్వయ పరిచే సయంలోనూ కిలివేటి మాకొద్దంటూ ఆయన ఎదుటే నిరసన గళాన్ని వినిపించారు. ఇటీవల గూడూరులో విజయసాయిరెడ్డిని అడ్డుకున్న కిలివేటి వర్గం ఆయనకే టికెట్ ఇవ్వాలని నినాదాలు చేసింది.ఏడాదిగా సాగుతున్న ఈ పరిణామాలతో టికెట్ కొత్త వ్యక్తికి ఇస్తారన్న ప్రచారం జరిగింది. అయితే నియోజకవర్గంలోని కొందరు సీనియర్ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించి మళ్లీ కిలివేటికే టికెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం అంగీకరించినట్టు తెలిసింది. దీంతో అధినేతను కలిసి కృతజ్ఞతలు చెప్పేందుకు కిలివేటి తన అనుచరవర్గంతో కలసి గురువారం తాడేపల్లి వెళ్ళారు. అక్కడ సీఎంను కలిశారు. ఈ మేరకు అక్కడ నుంచీ ఎమ్మెల్యే అనుచరులు ఫొటోలు, సమాచారం సామాజిక మాధ్యమాలకు విడుదల చేయడంతో నియోజకవర్గంలో అవి వైరల్ అవుతున్నాయి. దానికి తోడు గురువారం రాత్రి పార్టీ విడుదల చేసిన మూడవ జాబితాలో గూడూరు, సత్యవేడు, పూతలపట్టు, తిరుపతి ఎంపీ తదితర నాలుగు ఎస్సీ రిజర్వుడు స్థానాలలో కొత్త వారిని ఇంచార్జులుగా నియమించడం, అందులో సూళ్ళూరుపేట ప్రస్తావన లేకపోవడంతో దాదాపుగా కిలివేటికి లైన్ క్లియర్ అయినట్టుగా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.


టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి కమిషనర్ లాగిన్ ద్వారా చేర్చిన దొంగ ఓట్లను తొలగించాలి

- ఓటరుకార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలి
- టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 11: తిరుపతి నగరపాలక సంస్థ మాజీ కమిషనర్ గిరీషా లాగిన్ ద్వారా చేర్చిన 30వేల దొంగ ఓట్లను తొలగించాలని, అలాగే ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ డిమాండ్ చేశారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అప్పటి కమిషనర్ గిరీషా లాగిన్ ద్వారా 30వేల దొంగ ఓట్లను స్థానిక ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి నేతృత్వంలో చేర్చారని ఆరోపించారు. వెంటనే ఎన్నికల కమిషన్ దీనిపై దృష్టి సారించి తొలగించాలని డిమాండ్ చేశారు. నిజమైన ఓటరు ఓటు వేయాలంటే ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని కోరారు. ప్రజల ఆస్తులకు అధికార వైసీపీ ఎసరు పెడుతోందని, అందుకోసమే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకువచ్చిందని ఆరోపించారు. వైసీపీ కుయుక్తులను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు మద్దతు తెలపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాభీష్టంతో ఎన్నికల్లో గెలవాలే కాని దొంగ ఓట్లను అడ్డుపెట్టుకుని నెగ్గాలనుకోవడం సరికాదని హితవు పలికారు. టీడీపీ నాయకులు సూరా సుధాకర రెడ్డి, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్‌యాదవ్, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు, కంకణాల రజనీకాంత్‌నాయుడు, మునిశేఖర్ రాయల్, ఆముదాల తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోడు లబ్ధిదారులకు రూ.18.21కోట్లు

నమూనా చెక్కు అందుకుంటున్న లబ్ధిదారులు



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 11 : జగనన్న తోడు పథకంలో భాగంగా చిరు వ్యాపారుల ఆర్థిక స్వావలంబన కోసం నాలుగో ఏడాది ఎనిమిదవ విడత కింద జిల్లాలోని 16,541మంది లబ్ధిదారులకు రూ.17.50కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు.గతంలో రుణాలు తీసుకున్న 30,782మంది చిరు వ్యాపారులకు సుమారు రూ.70.71లక్షలు వడ్డీ రీయింబర్స్‌మెంట్ లభిస్తుందని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి లబ్ధిదారులకు రూ.18.21కోట్ల మెగా చెక్కును అందజేశారు.డీఆర్డీఏ, మెప్మా, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



'స్వచ్ఛ' అవార్డుల స్వీకరణ

- వాటర్ ప్లస్ 5 స్టార్ రేటింగ్స్‌లోనూ ర్యాంకులు

తిరుపతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణ్-2023 జాతీయ స్థాయి పురస్కారాలకు ఎంపికైన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు గురువారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం వాటిని అందజేసింది. దేశవ్యాప్తంగా పది లక్షల జనాభా కలిగిన నగరాల్లో నిర్వహించే పారిశుధ్య సర్వేలో తిరుపతి క్లీన్ సిటీగా నిలిచింది. అదేవిధంగా వాటర్ ఫ్రీ సిటీ, గార్బేజ్ ఫ్రీ సిటీగా కూడా సర్టిఫికేషన్ పొందింది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరి చేతుల మీదుగా మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, డీసీ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డీఈ విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య అవార్డులు అందుకున్నారు.

మహిళ హత్య కేసులో జీవిత ఖైదు

తిరుపతి(లీగల్), జనవరి 11: మహిళ హత్య కేసులో రేణిగుంట మండలం గుత్తివారిపల్లెకు చెందిన పి.మురళీకృష్ణకు జీవిత ఖైదుతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ తిరుపతి 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి గురునాథ్ గురువారం తీర్పుచెప్పారు. కోర్టు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆఫీసర్ ఎస్.వెంకటనారాయణ, లైజనింగ్ ఆఫీసర్ ఎల్.మునిరత్నంనాయుడు తెలిపిన వివరాల మేరకు.. 2014 డిసెంబర్ 19వ తేదీన తిరుపతి ఎస్వీయూ క్వార్టర్స్‌లో నివాసముంటున్న సుధారాణి హత్యకు గురైంది. ఆమె ఒంటి మీద నగలు అపహరణకు గురయ్యాయి. ఈ కేసులో ఎస్వీయూ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. కేసు నిరూపణ కావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ కోర్టు తీర్పుచెప్పింది. ముద్దాయిని తిరుపతి సబ్‌జైలుకు తరలించారు.

దర్యాప్తు చేతకాదా?

- ఈసీతో మాట పడ్డాం, ఏమి చెబుతారు?
- తిరుపతి పోలీసులకు డీజీపీ ఆఫీస్ క్లాస్

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'మీరందరూ పోలీసులే కదా! శాంతి భద్రతలు, దర్యాప్తు పోలీసు డ్యూటీలో ముఖ్యం. మరి దర్యాప్తు చేత కాదా? మీ నిర్లక్ష్యం వల్ల ఎన్నికల కమిషన్‌తో మాట పడ్డాం, ఏమని సమాధానం చెబుతారు' అంటూ పోలీసు ఉన్నతాధికారి తిరుపతి పోలీసులకు క్లాస్ పీకారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, డీఎస్పీలు, సీఐలుసహా పన్నెండు మంది పోలీసు అధికారులకు మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం చీవాట్లు పెట్టారు. ఎన్నికల వాతావరణం నెలకొనడంతో రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర ఎన్నికల కమిషన్ మూడు రోజులపాటు విజయవాడలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించింది. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక నుంచి వస్తోన్న మద్యం అక్రమ రవాణాను అరికట్టడంలో విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణాతోపాటు అనంతపురం ఎస్పీ అన్బురాజన్‌కు అక్షింతలు వేసింది. అంతకన్నా సీరియస్‌గా తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక సందర్భంగా నమోదైన ఎన్నికల అక్రమాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో స్థానిక పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై సీఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఎన్నికల కమిషన్ అంటే అంత లెక్కలేనితనమా..? పక్షపాతం చూపిస్తామంటే కుదరదు. అటువంటి ఆలోచన ఉంటే వెళ్లిపోండి. ఎన్నికల కమిషన్ నిఘా పెట్టి వెంట పడుతుంది. వెంటనే బై ఎలక్షన్ కేసులపై ఏమి చేశారో నివేదిక ఇవ్వండి' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యల్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి తిరుపతి ఉప ఎన్నికల్లో నమోదైన కేసుల దర్యాప్తుపై సమీక్షించారు. తిరుపతి జిల్లా ఎస్పీతోపాటు ఇతర అధికారులను డీజీపీ కార్యాలయానికి పిలిపించారు. ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత వైద్యుడైన గురుమూర్తిని ఎంపీగా గెలిపించుకోవడానికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలు ఉల్లంఘనలకు పాల్పడ్డారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది వైసీపీ కార్యకర్తల్ని తిరుపతికి తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయించారంటూ టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు అప్పట్లో ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా పరిధిలో పదుల సంఖ్యలో పోలీసు కేసులు నమోదయ్యాయి. ఉప ఎన్నిక అనంతరం ఎఫ్ఐఆర్ కాపీలను పక్కన పడేసిన పోలీసులు దర్యాప్తు పూర్తిగా ఆపేశారు. దీంతో ఆయా కేసుల వివరాలతో, కేసులు ఏ స్టేషన్ పరిధిలో నమోదయ్యాయో వాటి ఎస్‌హెచ్‌వోలను సైతం డీజీపీ పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శాంతిభద్రతల ఏడీజీ శంకబ్రత బాగ్చి ఈ కేసులన్నింటిపై సుదీర్ఘంగా సమీక్షించి వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

సీఐడీ విచారణకు ఎన్ఆర్ఐ యశ్


యశ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఘటనలో నోటీసులు అందుకున్న ఎన్ఆర్ఐ యశ్ బొద్దులూరి విచారణ నిమిత్తం గురువారం తిరుపతిలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని పరామర్శించేందుకు వచ్చిన ఆయన్ని గతనెలలో శంషాబాద్ విమానాశ్రయంలో సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకుని గుంటూరు సీఐడీ కార్యాలయానికి తరలించిన విషయం తెలిసిందే. అనంతరం ఈనెల 11న తిరుపతికి కార్యాలయానికి విచారణకు రావాలని 41ఏ సీఆర్పీసీ కింద యశ్‌కు సీఐడీ నోటీసులు జారీచేసింది.

రేపటి నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

తిరుచానూరు, జనవరి 11: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ఏవో ఖాదరవల్లి తెలిపారు. శాస్త్రీయనృత్యం, సినీ నృత్యాలు, కామెడీ స్కిట్స్, జానపద కళారూపాలు ప్రదర్శన ఉంటుందని వివరించారు. చివరి రోజు 16న సాయంత్రం గాలిపటాలు ఎగురవేస్తారని తెలిపారు. సంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో పిల్లలు, పెద్దలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.



పోలింగ్ కేంద్రం పరిశీలన

పాకాల, జనవరి 11: మండలంలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ యశ్వంత్ గురువారం పరిశీలించారు. సామిరెడ్డిపల్లెలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లను, అల్లర్లకు పాల్పడేవారిని ముందస్తుగా బైండోవర్ చేసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ ఓబులేసు, ఎస్ రామకృష్ణ, పోలీసు సిబ్బంది సోమశేఖర్, సౌరెడ్డి పాల్గొన్నారు.



చంద్రబాబు ఇంటి ఎదుట పసుపు తోరణాలు - ఇంటి ఆవరణల రంగవల్లులు

నారావారిపల్లెకు సంక్రాంతి శోభ

నేడు భువనేశ్వరి, రేపు చంద్రబాబు, లోకేశ్ రాక

చంద్రగిరి, జనవరి 11: టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనకు ఆయన స్వగ్రామం నారావారిపల్లె ముస్తాబవుతోంది. ఆయన తన కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగకు రానుండడంతో ఇంటితో పాటు గ్రామంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి సంక్రాంతి పండుగకు నారావారి పల్లెకు నారా, నందమూరి కుటుంబాలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే ఏడాది కూడా రానున్నారు. ఇందుకోసం పండుగ ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ నుంచి ప్రత్యేక బృందం వచ్చి చంద్రబాబు ఇంటికి పెయింటింగ్ వేశారు. ఆవరణను రంగవల్లులతో తీర్చి దిద్దారు. అదేవిధంగా చంద్రబాబు తల్లిదండ్రుల సమాధుల వద్ద, కులదైవం నాగాలమ్మ ఆలయం వద్ద, గ్రామ దేవతల వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. పార్కింగ్, భద్రతా సిబ్బంది ఉండటానికి టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాట్లు చేశారు. గ్రామంలో టీడీపీ తోరణాలు కట్టారు. ముందుగా శుక్రవారం మధ్యాహ్నం నారా భువనేశ్వరి రానున్నారు. శనివారం చంద్రబాబు, లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్, నందమూరి బాలకృష్ణ, ఇతర నందమూరి కుటుంబ సభ్యులు రానున్నారు. ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి పండుగను జరుపుకోనున్నారు. 15వ తేదీ మధ్యాహ్నం చంద్రబాబు, నారా లోకేశ్, బాలకృష్ణ తిరిగి పయనమవుతారు. 16న నారా భువనేశ్వరి, కుటుంబ సభ్యులు హైదరాబాదుకు తిరిగి వెళ్లనున్నారు.




గోకులాపురంలో జల్లికట్టు

రామచంద్రాపురం, జనవరి 11: మండలంలోని అనుపల్లి పంచాయతీ గోకులాపురంలో గురువారం జల్లికట్టు ఉత్కంఠ భరితంగా జరిగింది. గ్రామస్తులు తమ కోడిగిత్తలకు గ్రామ శివారులో పూజలు నిర్వహించి అల్లి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ కోడిగిత్తల కొమ్ములకు విలువైన బహుమతులు కట్టి డప్పులు వాయించడంతో అవి అల్లివైపు పరుగులు తీశాయి. వీటిని నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో కొందరికి స్వల్పగాయాలయ్యాయి. బహుమతులు అందుకున్న యువకులు కేరింతలు కొట్టారు. జల్లికట్టును తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచే గాక వెదురుకుప్పం మండలం నుంచి భారీగా జనం తరలివచ్చారు. నిర్వాహకులు జల్లికట్టును తిలకించేందుకు వచ్చిన వారికి భోజన వసతి కల్పించారు.

పొలాలపై ఏనుగుల దాడులు

పాకాల, జనవరి 11: మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ పెరుమాళ్లగుడిపల్లె సమీపంలో బుధవారం రాత్రి ఏనుగులు పంటపొలాలను ధ్వంసం చేశాయి. పదిపుట్లబైలు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏనుగులు రెండు నెలలుగా పొలాలను నాశనం చేస్తున్నాయి. ఎం.సుబ్రమణ్యం అరటి తోట, పెద్ద ఎర్రయ్య మామిడి తోటలకు తీవ్ర నష్టం కలిగించాయి.


పెరుమాళ్ల గుడిపల్లె సమీపంలో ఏనుగులు ధ్వంసం చేసిన అరటితోట




చిన్నగొట్టిగల్లులో గజరాజుల బీభత్సం

భాకరాపేట, జనవరి 11: పంట పొలాలపై గజరాజులు బీభత్సం సృష్టించాయి. చిన్నగొట్టిగల్లు మండలం దిగువూరు పంచాయతీ మట్లివారిపల్లెకు చెందిన రైతు లక్ష్మీదేవి అరటి తోటను ధ్వంసం చేశాయి. సుమారు అరెకరం వరకు తొక్కి నాశనం చేశాయి. అలాగే నెల్లుట్లవారి పల్లె పంచాయతీ దిగువ గుంతాటివారిపల్లె సమీపంలోని శాంతమ్మకు సంబంధించిన మామిడి తోటకు వేసిన ఫెన్సింగ్‌ను కూల్చివేశాయి. సుమారు 20 కూసాలు విరిగిపోయాయి. పీవీసీ పైపులను విరిచేశాయి.

ఏనుగులు ధ్వంసం చేసిన పీవీసీ పైపులు - ఏనుగులు విరిచేసిన ఫెన్సింగ్ కూసాలు

రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడి మృతి

పాకాల, జనవరి 11: పాకాల - తిరుపతి రైల్వేమార్గంలోని పాలినేనిపల్లె సమీపంలో ఓ గుర్తు తెలి యని వృద్ధుడు (65-70) రైలు పట్టాలపై పడి మృతిచెందాడు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుంతకల్లు - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు రైలుఢీకొని మృతిచెందాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనేది తెలి యాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చిత్తూరు జీఆర్పీ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వృద్ధుడి మృతదేహం

శ్రీవారికి విరాళంగా 6.7 కేజీల వెండి గంగాళం


వెండి గంగాళంతో ఎంజీ రెడ్డి

తిరుమల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి గురువారం వెండి గంగాళం విరాళంగా అందింది. అనంతపురం జిల్లా కనసనివారిపల్లెకు చెందిన ఎంజీ రెడ్డి 5.90 లక్షల విలువైన 6.7 కేజీల వెండి గంగాళాన్ని గురువారం శ్రీవారి ఆలయంలో అధికారులకు అందజేశారు.శ్రీవారికి మొక్కుకున్న తర్వాత తన కోరిక నెరవేరిన క్రమంలో తన బరువుతో సమానంగా రూపాయి నాణేలతో పాటు కేజీకి వంద గ్రాముల వెండి చొప్పున శ్రీవారికి ఆభరణాలు, పూజలకు వినియోగించే వస్తువులను అందజేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా బెంగుళూరులో స్వచ్ఛమైన వెండితో తయారు చేయించిన గంగాళాన్ని స్వామికి సమర్పించినట్టు తెలిపారు.వచ్చే పదేళ్లలో దశావతారాల్లోని ఒక్కో అవతారానికి ఉన్న ఆయుధాలను కూడా తయారు చేయించి స్వామికి అందజేస్తానన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

పాకాల, జనవరి 11: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని గురువారం పాకాల రైల్వే స్టేషన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేవరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.శేఖర్, అనిల్‌కుమార్, ఎర్రయ్య, ఆంథోని, రాము, వెంకటముని, సురేష్, రాజేష్, ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

ప్రజల్లోకి అంబేడ్కర్ భావజాలం
కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 11 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావాజాలన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లోకి తీసుకెళుతోందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. సామాజిక సమతా సంకల్ప స్ఫూర్తిగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను గురువారం ఆయన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే ఆదిమూలంలో కలిసి తిలకించారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. అందరికీ విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యం తో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. అనంతరం సంతకాల ఫ్లెక్సీపై కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సంతకాలు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, సాంఘికసంక్షేమసాధికార అధికారి చెన్నయ్య, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


చోటా కే నాయుడు

తిరుమల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ సంగీత దర్శకుడు తమన్, సినిమాటోగ్రాఫర్ చోటా కే నాయుడు ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకుందాం..
వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్


గాలిపటాలను ఎగురవేస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి (రవాణా), జనవరి 11 : సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకుందామని వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ అన్నారు. గురువారం కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సంస్కృతీ సం ప్రదాయాలను సంరక్షించి భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈనెల 13న ఉదయం 10 గంటలకు తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే గాలిపటాల పోటీలలో నగరంలోని పిల్లలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరాటే శ్రీనివాస్, పూకా విజయకుమార్, గుండాల గోపినాథ్, వెంకటేష్, అజయ్‌కుమార్, చెన్నం నవీన్, చంద్రశేఖర్, ఆనంద్, గోపి, ప్రసాద్, వాసు, హేమకిరణ్, రోషన్, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం


హాకీ క్రీడాకారులతో మోహిత్‌రెడ్డి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 11 : ఎస్వీయూ క్రీడా మైదానంలో 14వ జూనియర్ మెన్ రాష్ట్ర స్థాయి హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించి, 26 జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల నిర్వహణకు రూ.50వేలు నగదు అందజేశారు. క్రీడల్లో రాణించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఏపీ హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజు మాట్లాడుతూ హాకీ పట్ల యువత ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి థామస్ పీటర్, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

బస్టాండులో చెత్త తరలింపు


చెత్త తరలించి శుభ్రం చేసిన ప్రాంతం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 11: సెంట్రల్ బస్టేషన్‌లో పేరుకుపోయిన చెత్తకుప్పలను తరలించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో బస్టాండులో కంపు కంపు శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆర్టీసీ, నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది ఉదయం చెత్తలారీలను తీసుకొచ్చి తరలించారు. దుర్వాసన వెదజల్లకుండా బ్లీచింగ్ చల్లారు.

తిరుపతి పారిశ్రామికవేత్తలకు అవార్డులు


ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు అందుకుంటున్న కోరా విజయ - నేషనల్ ఎక్స్‌పర్ట్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న కోరా వెంకట రమేష్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 11: చెన్నైలో అజంతా షూ కంపెనీ మేనేజింగ్ పార్టనర్‌గా వ్యవహరిస్తున్న తిరుపతికి చెందిన పారిశ్రామికవేత్త కోరా విజయ షూస్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 2022-23 సంవత్సరానికి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు, అలాగే కోరా షూస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఎక్కువ టర్నోవర్ సాధించినందుకు కోరా వెంకట రమేష్‌కు నేషనల్ ఎక్స్‌పర్ట్ ఎక్సలెన్స్ అవార్డు లభించాయి. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం నిర్వహించి కార్యక్రమంలో కేంద్ర మంత్రి రఘుఠాకూర్ చేతుల మీదుగా వారు అవార్డులు అందుకున్నారు. ఆలిండియా స్థాయిలో ఈ రెండు కంపెనీలు అవార్డులు అందుకోవడం పట్ల పలువురు అభినందించారు.



సీఆర్ రాజన్‌కు సన్మానం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుచానూరు మాజీ సర్పంచ్ సీఆర్ రాజన్ జన్మదినం సందర్భంగా గురువారం ఆయన్ను గజమాలతో సత్కరిస్తున్న కిషోర్‌రెడ్డి, హరిరామ్‌రెడ్డి, సాయి రాయల్, తిరుచానూరు టీడీపీ నేతలు

ఈఎస్ఐ ఉద్యోగులకు ఉచిత చికిత్స

తిరుపతి సిటీ, జనవరి 11 : శ్రీరమాదేవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఈఎస్ఐ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా అత్యాధునిక పద్ధతులతో కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స అందిస్తున్నట్లు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ డి.బి.శశిధర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తుంటి, మోకాళ్లు, కీళ్ల మార్పిడి చికిత్సలతో పాటు జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు, విరిగిన ఎముకలు, జారిన కీళ్ల సర్జరీలకు, వెన్నెముక సర్జరీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు

తిరుమల,జనవరి11(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 62,449 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,555 మంది తలనీలాలు సమర్పించారు.

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకపోతే
సీఎం ఇంటిని ముట్టడిస్తాం..!


31 ఆకారంలో కూర్చుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

తిరుపతి (రవాణా), జనవరి 11 : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే సీఎం ఇంటిని ముట్టడించాల్సి వస్తుందని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ హెచ్చరించారు. సమ్మె 31వ రోజుకు చేరుకోవడంతో ఆ సంఖ్యను సూచించేలా తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరం ముందు అంగన్వాడీలు కూర్చుని నిరసన తెలియజేశారు. కె.వేణుగోపాల్ మాట్లాడుతూ మహిళలు 31 రోజులుగా పోరాటం చేస్తుంటే ముఖ్యమంత్రి పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వీరి తర్వాత సమ్మె బాట పట్టిన మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి, అంగన్వాడీలను గాలికి వదిలేయడం బాధాకరమన్నారు. చర్చలకు పిలిచిన ప్రతిసారీ ప్రధాన డిమాండ్ మినహా మిగిలినవి పరిష్కరిస్తామని మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చెప్పడం సబబు కాదన్నారు. వేతనాలు పెంచితేకాని తిరిగి విధుల్లోకి వెళ్లేది లేదని అంగన్వాడీలు చెబుతున్నారని, పండుగలు కూడా దీక్షా శిబిరం వద్ద జరుపుకోవడానికి సిద్ధమయ్యారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూల దృక్పథంలో ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తంజావూరు మురళి, అంగన్వాడీ నాయకులు నాగరాజమ్మ, గీత, ఎల్లమ్మ, సుజాత, సుజిత, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, గోమతి, గంగాదేవి, కల్పన పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు


భోగిమంటలు వేసి..గొబ్బి తడుతున్న లిటిల్‌ఏంజెల్స్ స్కూల్ విద్యార్థులు, టీచర్లు - విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 11 : యశోదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. ముత్యాలముగ్గుల నడుమ భోగిమంటలు వేసి గౌరీదేవి పాటలు ఆలపించి, అలరించారు. కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ కె.రమాదేవి, ప్రిన్సిపాల్ వై.పద్మశ్రీ, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● **ఎస్వీఎస్ కాలేజీలో :** టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీఎస్ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించి ప్రతిభచాటిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌కు 132 ఏళ్లు
అభివృద్ధి పథంలో ప్రపంచ స్థాయికి..


తిరుపతి స్టేషన్ మహోత్సవ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాధర్

తిరుపతి(ఆటోనగర్) జనవరి 11 : తిరుపతి రైల్వేస్టేషన్ 132 వసంతాలు పూర్తి చేసుకుని 133వ వసంతంలోకి ప్రవేశించిందని, అభివృద్ధి పథంలో ప్రపంచస్థాయికి చేరుకుంటోందని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మాజీ కార్యదర్శి కళాధర్ అన్నారు. స్టేషన్ ప్రాంగణంలో గురువారం ప్రారంభించిన రోజు(తిరుపతి స్టేషన్ మహోత్సవ్)ను ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులు పంచాక్షరం, సుబ్బన్నను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ 132 ఏళ్ల క్రితం చిన్న స్టేషన్‌గా మీటర్ గేజ్ రైలుతో ప్రారంభమై ప్రస్తుతం రూ.300 కోట్లతో ప్రపంచ స్థాయి వసతులతో అభివృద్ధి పథంలో ఉందన్నారు. భక్తుల రద్దీకనుగుణంగా రైళ్ల రాకపోకలు పెరిగాయన్నారు. ఒక రైలుతో ప్రారంభమై నేడు వంద రైళ్లతో లక్ష మంది ప్రయాణికులకు సేవలందిస్తోందని వెల్లడించారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులు తమ అనుభవాలను సహచరులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి, సీసీఐ పి.శ్రీకాంత్, సుదర్శన్ రాజు, విశ్రాంత ఉద్యోగులు పరమేశ్వరరాజు, రాజేంద్రప్రసాద్, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.


హీరో నిఖిల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎడిఫై డైరెక్టర్ ప్రణీత్ - డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

విద్యార్థి దశలో చదువును నిర్లక్ష్యం చేయొద్దు
అభిరుచులను దాచుకోవద్దు ● హీరో నిఖిల్ సిద్ధార్థ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 11 : విద్యార్థి దశలో చదువు చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ దానిపై దృష్టి పెట్టి ఉన్నతస్థాయికి ఎదగాలని హీరో నిఖిల్ సిద్ధార్థ కోరారు. తిరుచానూరులోని ఎడిఫై పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ స్కూల్‌ను చూస్తుంటే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయన్నారు. చదువుతో పాటు మనలోని ట్యాలెంట్‌ను దాచుకోవద్దని, జీవితంలో ఎదగడానికి అది దోహదపడుతుందని అన్నారు. మీలో ఎంతోమంది భవిష్యత్తులో పవన్‌కల్యాణ్, మహేష్‌బాబు, పూజాహెగ్డే, తమన్నాలు కావచ్చునని అన్నారు. క్రమశిక్షణతో ఆ స్థాయికి రావాలని సూచించారు. తాను కూడా ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత తల్లిదండ్రుల అనుమతితో సినిమా ఇండస్ట్రీకి వచ్చానని, అదృష్టం కొద్దీ అవకాశాలు రావడంతో హీరోగా వెలుగొందుతున్నానని అన్నారు. ఎడిఫై స్కూల్‌కు దేశంలోనే మంచిపేరు ఉందని, విభిన్నరంగాల్లో రాణించాలని కోరారు. క్రీడా పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఫై విద్యాసంస్థల చైర్‌పర్సన్ సులోచన, డైరెక్టర్ ప్రణీత్, డాక్టర్ స్ఫూర్తిప్రియ, డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

రుయాలో ప్రైవేటు అంబులెన్స్‌ల హల్‌చల్
● ఒక్కో వాహన అనుమతికి రూ.వంద వసూలు


పగలు ఆస్పత్రి ముందు పార్కింగ్ చేసివున్న ప్రైవేటు అంబులెన్సులు


రాత్రిపూట రుయాస్పత్రి ఆరవణలో ఆగివున్న ప్రైవేటు అంబులెన్సులు

తిరుపతి సిటీ, జనవరి 11: రుయాస్పత్రి ప్రైవేటు అంబులెన్సులకు అడ్డాగా మారుతోంది. ఆస్పత్రి ఆవరణలో ప్రైవేటు అంబులెన్సులను నిలపరాదని అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. పగలంతా ఆస్పత్రి ముందే నిలిపి వుండే వాహనాలు చీకటిపడితే ఆస్పత్రి ఆవరణలోకి చేరిపోతున్నాయి. సాయంత్రం 6 గంటల తర్వాత అడిగే వారు లేకపోవడంతో అత్యవసర విభాగం ముందు పార్కింగ్ చేసేస్తున్నారు. అడ్డుకోవాల్సిన సిబ్బంది ఒక్కో అంబులెన్సుకు రూ.వంద లెక్కన తీసుకుని అనుమతిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ప్రైవేటు అంబులెన్సుల నిర్వాహకులు నేరుగా వార్డుల్లోకి వెళ్లి రోగులతో బేరాలు కుదుర్చుకుంటున్నారు. దీనికి తోడు రాత్రిళ్లు బయటి నుంచి వచ్చే ఇతర ప్రైవేటు వాహనాలను లోపలకు అనుమతించకపోతుండడంతో వీరు అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వరిలో జింక్ లోపాన్ని నివారించండి


జింక్‌లోప లక్షణాలతో ఉన్న వరిపైరు

తిరుపతి(విద్య), జనవరి 11: రబీలో వరి పైరుకు జింక్ తక్కువయితే దిగుబడిపై ప్రభావం చూపుతుందని, పైరు పచ్చగా ఎదిగి బాగా దుబ్బు చేసేందుకు జింక్ చాలా అవసరమని వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య పేర్కొన్నారు.ఈ ఏడాదిలో ఈశాన్య రుతుపవన వర్షాలు ఆలస్యం కావడం వల్ల చాలామంది రైతులు దుక్కిలో జింక్ ఎరువును సిఫారసుల మేరకు వేయలేకపోయారని, దాంతో వరిలో ఈ లోపం ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. సున్నం, చౌడు, భాస్వరం ఎక్కువ ఉన్న భూముల్లో మొక్కలకు జింక్ సరిగా అందదని, మురుగునీరు బయటకుపోని పల్లపు ప్రాంతాలలో కూడా జింక్‌లోపం ఎక్కువగా కనిపిస్తుందని వివరించారు. దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు.

● **లోప లక్షణాలు ఇలా :** వరినాటిన 2-6వారాల మధ్య లోప లక్షణాలు కనిపిస్తాయని, మొక్కల్లో పెరుగుదల మందగించి గిడసబారుతాయని పేర్కొన్నారు. పిలకలు రావడం తగ్గుతుందని, మొక్కల మధ్య ఆకులలో ఈనెల మధ్యభాగం పసుపురంగుకు మారుతుందన్నారు. ముదురు ఆకు చివర్లలో తుప్పు మచ్చలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆకులు పెలుసుగా ఉండి వంచితే శబ్దం చేస్తూ సులభంగా విరిగిపోతాయని తెలిపారు. పొలంలో అక్కడక్కడా మొక్కలు సరిగా పెరగకుండా ఖాళీలు కనిపిస్తాయన్నారు.

● **నివారణ చర్యలు :** మురుగునీరు బయటకుపోని పొలాల్లో నాటిన రెండు వారాల తర్వాత పాతనీరు పూర్తిగా తీసేసి కొత్తనీరు అందించాలని తెలిపారు. చౌడు భూముల్లో మొదటి దఫా పైపాటుగా వేసే యూరియాకి బదులుగా అమ్మోనియం సల్ఫేట్ వేస్తే చౌడుగుణం తగ్గి జింక్ పెరుగుతుందని వివరించారు. వరి పైరులో ఈ లోప లక్షణాలు కనిపిస్తే లీటరు నీటికి 2గ్రాముల జింక్‌సల్ఫేట్, 5గ్రాముల యూరియాను వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలని సూచించారు. చిలేటెడ్‌రూపంలో మార్కెట్‌లో దొరికే చిలామినిన్ జింకును లీటరు నీటికి గ్రాము చొప్పున కలపి అవసరాన్ని బట్టి ఒకటి రెండు సార్లు స్ప్రే చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఇతర వివరాల కోసం 8331057872ను సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలే దీక్ష



తిరుపతి(లీగల్), జనవరి 11 : ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు నిరసనగా తిరుపతి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్ష గురువారం 4వ రోజుకు చేరుకుంది. సీనియర్ న్యాయవాది వై.సురేష్‌రాజు అసోసియేట్స్ ఆధ్వర్యంలో 17మంది న్యాయవాదులు దీక్షలో కూర్చుకున్నారు. 300మంది కక్షిదారులు వీరికి సంఘీభావం తెలిపారు. న్యాయవాదులు రమేష్, జగదీష్, సాయికుమార్, భాస్కర్, నవీన్, మునిశేఖర్, వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మీపతి, గణేష్, చెంచమ్మ, రాధాకృష్ణ, కిరణ్, పవన్, ఆసియా తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు వెళ్లే దారేది..?
● దోమలకు ఆవాసంగా గుంత
● నెలల తరబడి ఉన్నా పట్టించుకోని అధికారులు



తిరుపతి (రవాణా), జనవరి 11: నగర పరిధిలోని అక్కారంపల్లె వద్ద(1వ డివిజన్) నూతనంగా నిర్మించిన తిరుప్పావై మార్గం చివరిలో మురుగునీరు నిల్వ ఉంటూ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు నిర్మించే క్రమంలో డ్రైనేజీ నీరు వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేయకపోవడంతో మడుగులాగా తయారైంది. ఆ నీరు రోడ్డుపై ప్రవహిస్తూ వాహనదారులను ఇబ్బందిపెడుతోంది. అక్కారంపల్లె, కొత్తపల్లి కాలనీలకు చెందిన ప్రజలంతా ఈ మార్గంగుండానే రాకపోకలు సాగించాల్సి ఉంది. పైగా అక్కడికి సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఉండడంతో విద్యార్థులు సైతం ఇబ్బంది పడుతున్నారు. దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది చుట్టుపక్కల వారికి నిద్ర లేకుండా చేస్తున్నాయి. నెల రోజులుగా స్థానికులు చెబుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.



కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

వడమాలపేటలో 'ఆపరేషన్ స్వేచ్ఛ'



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

వడమాలపేట, జనవరి 11: బాల కార్మికులకు స్వేచ్ఛ కల్పించాలని నినాదాలు చేస్తూ కార్మిక, పోలీస్ శాఖలు, మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం వడమాలపేటలో ర్యాలీ నిర్వహించారు. పిల్లలను పనిలో చేర్చుకోకూడదని, విద్య పట్ల ఆకర్షించేలా తోడ్పాటు అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్మికశాఖ అధికారి హేమాద్రి, పలు దుకాణాలను పరిశీలించి పిల్లలను పనిలో చేర్చుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాలీలో ఎస్‌ఐ రామాంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ రమణరాజు, మండల న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం

పుత్తూరు అర్బన్, జనవరి 11: కార్మికుల సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తోందని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంబీ రోడ్డులో సీఐటీయూ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. జిల్లాలో కార్మికులకు ఏ కష్టమొచ్చినా సీఐటీయూ పోరాటాలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. భవిష్యత్తులోను కార్మికుల కోసం సీఐటీయూ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎస్ఎస్ నాయుడు, ఎల్ఐసీ యూనియన్ కార్యదర్శి లక్ష్మణకుమార్, దస్తగిరి, ఆటో యూనియన్ కార్యదర్శి పురుషోత్తం, విజయ్, అంగన్వాడీ యూనియన్ నాయకులు మునికుమారి, విజయకుమారి పాల్గొన్నారు.

నేడు పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ల అందజేత

వడమాలపేట, జనవరి 11: సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్ల ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. వడమాలపేట మండలంలోని పెన్షనర్లకు శుక్రవారం ఉదయం వడమాల గ్రామంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో అందజేయడంతో జరుగుతుందన్నారు. పెన్షనర్లు తమ ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ తీసుకుని రావాలన్నారు. ఈ అవకాశాన్ని పెన్షనర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎన్జీవోస్ పుత్తూరు తాలూకా అసోసియేట్ ప్రెసిడెంట్ లోకనాథం కోరారు.



టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుచానూరు మాజీ సర్పంచు సీఆర్ రాజన్ జన్మదినం సందర్భంగా గజమాలతో శుభాకాంక్షలు తెలుపుతున్న కిషోర్‌రెడ్డి, హరిరామ్‌రెడ్డి, సాయి రాయల్

పుత్తూరు వార్తలు

చంద్రన్నతోనే రాష్ట్రం సుభిక్షం



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

నారాయణవనం, జనవరి 11: చంద్రన్నతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు గిరిబాబు పేర్కొన్నారు. గురువారం నారాయణవనం లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనతో రాష్ట్రం అప్పులమయంగా మారిందని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీని ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షణ్ముగం, బాబు, కందస్వామి, లక్ష్మన్, రవి, రమేష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఆర్ రాజన్‌కు జనసేన నేతల శుభాకాంక్షలు



సీఆర్ రాజన్‌కు కేక్ తినిపిస్తున్న జనసేన నేతలు

పుత్తూరు టౌన్, జనవరి 11: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుచానూరు మాజీ సర్పంచు సీఆర్ రాజన్‌కు పుత్తూరు జనసేన నాయకులు గోపీరాయల్, కృష్ణయ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం తిరుచానూరులోని సీఆర్ రాజన్ నివాసంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు జనసేన నాయకులు రమేష్‌బాబు, భాస్కర్, రవి, బాలురాయల్, హరి, శేఖర్ రాయల్ ఉన్నారు.

రేణిగుంట-నంద్యాల రైలు నేడు ప్రారంభం

రేణిగుంట,జనవరి11: రేణిగుంట- నంద్యాల మధ్య ప్రత్యేక ప్యాసింజరు రైలును గురువారం ప్రారంభించడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. నంద్యాల-కడప వరకు రోజువారీ రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక ప్యాసింజరు(07284-07285)ను రేణిగుంట రైల్వేజంక్షన్ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ రైలును కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభిస్తారని తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

శ్రీకాళహస్తి జనవరి 11: శ్రీకాళహస్తి మున్సిపల్ కార్మికులు గురువారం సమ్మెను విరమించారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్న కమిషనర్ రమేష్ బాబు ప్రజా ఇబ్బందుల దృష్ట్యా సమ్మెను విరమించాలని కోరారు. దీంతో కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరారు.

అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయ్: భానుప్రకాష్



ఎస్‌వీ పురంలో కరపత్రాలు అందజేస్తున్న భానుప్రకాష్

వడమాలపేట, జనవరి 11: రాష్ట్రంలో అరాచకపాలన అంతమయ్యే రోజులు దగ్గర పడ్డాయని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం మండలంలోని ఎస్‌వీ పురం పంచాయతీలో మీ కోసం - మీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. పలు గ్రామాల్లో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ అధికారంలోకి అలవికాని హామీలిచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగించారని అన్నారు. నగరి నియోజకవర్గ ప్రజలు తనను నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. తన తండ్రి ముద్దుకృష్ణమ నాయుడు నడిచిన బాటలో నడుస్తూ నిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు చెన్నూరు సుధాకర్, నాయకులు జానా వెంకటయ్య, హేమావతి, శేషాద్రి యాదవ్, మునిశేఖర్, మణిరాజు, ధనంజయులు నాయుడు, లక్ష్మీప్రసన్న, జగపతి రాజు, శ్రీనివాసుల రాజు, వెంకమరాజు, నితీష్, హేమాద్రి, చిరంజీవి, నవీన్, మునిరత్నం, సుబ్బరాయులు, వెంకయ్య, వెంకటేష్ యాదవ్, నాగభూషణం, వెంకటేశ్వరరావ్, శేఖర్ నాయుడు, శ్రీనివాసులు, మధురాజు వెంకట్రామరాజు, చెంగల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నోటీసులతో సమ్మెను అణచివేయలేరు: సీఐటీయూ



అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా పాల్గొన్న సీఐటీయూ నాయకులు

పుత్తూరు అర్బన్, జనవరి 11: నోటీసులతో అంగన్వాడీల సమ్మెను అణచివేయలేరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వంలో చలనం కూడా లేకుండా పోయిందని మండిపడ్డారు. విశాఖపట్టణంలో సీఎం జగన్ తన ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వ ధనం రూ.500 కోట్లు వెచ్చించగా లేనిది అంగన్వాడీలకు వేతనాలు పెంచడానికి మాత్రం మనసు రావడం లేదని దుయ్యబట్టారు. తన విలాసాల కోసం ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేస్తున్న సీఎం జగన్ అంగన్వాడీల వేతనాల పెంపు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం గర్హణీయమన్నారు. పెరిగిన ధరలతో అంగన్వాడీలు చాలీచాలని జీవితాన్ని గడుపుతున్నారని, గత ఎన్నికల సందర్భంగా సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలనే వారు కోరుతున్నారని ఆయన గుర్తుచేశారు. నెలకు పైగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా నోటీసులతో బెదిరించాలని చూడడాన్ని తప్పుపట్టారు. ఎస్మా చట్టాన్ని అంగన్వాడీలపై ప్రయోగిస్తే ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం బేషరతుగా దిగివచ్చి అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలని చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎస్ఎస్ నాయుడు అంగన్వాడీలకు మద్దతుగా దీక్షాశిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు మునికుమారి, విజయకుమారి, ధనమ్మ, రాధా, పద్మజ, మోహనలక్ష్మీ, లలిత, ప్రమీల, హైమావతి, అన్నపూర్ణ, గంగులమ్మ, అరుణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఆడుదాం ఆంధ్ర పోటీలు

నారాయణవనం, జనవరి 11: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానంలో గురువారం ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పురుషుల ఖోఖో ఫైనల్స్‌లో కొండల చెరువు సచివాలయ జట్టుపై పాలమంగళం జట్టు 22-04 స్కోరు తేడాతో విజయం సాధించి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైంది. అదేవిధంగా బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో పాలమంగళం జట్టుపై నారాయణవనం 3 సచివాలయ జట్టు విజయం సాధించింది. మహిళల బ్యాడ్మింటన్‌లో అరణ్యంకండ్రిగ జట్టు తుంబూరు సచివాలయ జట్టుపై విజయం సాధించి నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హత సాధించాయి. పర్యవేక్షకులుగా ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏవో శేఖర్, కోఆర్డినేటర్ జయప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశులు, జయప్రద, సదాశివం, రాజా పాల్గొన్నారు.



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన పాలమంగళం సచివాలయ జట్టు

వేడుకగా అమావాస్య ఉత్సవం



స్వామి అమ్మవార్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, జనవరి 11: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమావాస్య ఉత్సవం గురువారం వేడుకగా జరిగింది. అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు.ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నామం దివ్య ఔషధం



అక్షింతలు పంపిణీ చేస్తున్న కోలా ఆనంద్, సత్రవాడ ప్రవీణ్

శ్రీకాళహస్తి, జనవరి 11 : శ్రీరామ నామం దివ్య ఔషధం అని టీడీపీ నాయకులు,మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య తనయుడు ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని పానగల్ శ్రీరామ మందిరంలో గురువారం అయోధ్య నుంచి విచ్చేసిన అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముక్కంటి ఆలయ మాజీ చైర్మన్ కోలా ఆనంద్,సత్రవాడ ప్రవీణ్ అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అంగన్వాడీల డిమాండ్లు తీర్చాల్సిందే



శ్రీకాళహస్తిలో రిలే దీక్షలు

శ్రీకాళహస్తి, జనవరి 11: తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం తీర్చాల్సిందేనని అంగన్వాడీలు డిమాండు చేశారు.శ్రీకాళహస్తి పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రం వద్ద గురువారం రిలే దీక్షతో నిరసన సమ్మెను కొనసాగించారు. ఈసందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. న్యాయం కోసం పోరాడుతున్న తమపై ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించడం తగదన్నారు.ఈకార్యక్రమంలో భారతి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఫొటో పెట్టి జోలపాట పాడుతున్న అంగన్వాడీలు

పిచ్చాటూరులో వినూత్న నిరసన

పిచ్చాటూరు, జనవరి 11: పిచ్చాటూరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం కూడా అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు వినూత్న రీతిలో ఉయ్యాల ప్రదర్శన నిర్వహించారు. సమ్మె శిబిరంలో ఉయ్యాల కట్టి ఆ ఊయలలో సీఎం జగన్ పటాన్ని ఉంచి ఊయల ఊపుతూ మొద్దునిద్రపోతున్న జగనన్న ఇప్పటికైనా లేచి మా జీతాలు పెంచన్నా అంటూ జో లాలి పాటలతో అలరించారు. తాడేపల్లి కొంపలో మీరు మొద్దునిద్ర పోతుంటే కరపత్రాల పంపిణీ జీతగాడు సజ్జల సచ్చు సలహాలతో చర్చలు విఫలమవుతున్నాయి. మీరు నిద్ర లేచి న్యాయం చేయండంటూ పాటలు పాడారు.

కొనసాగుతున్న సమ్మె



సత్యవేడులో అంగన్‌వాడీల సమ్మె

సత్యవేడు, జనవరి 11: సత్యవేడులో అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న సమ్మె కొనసాగుతోంది. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద వేతనాలు పెంచాలని కోరుతూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, డీవైఎఫ్ఐ మురళి, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, భువన, సరళ, శాంతి, ఝాన్సీ కాంతమ్మ, భారతి, నాగరాజు, మంజుల, చెందామరై, విజయ, పార్వతి, అనురాధ, సుజాత, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిపాలనకు జగన్ అనర్హుడు : చింతా



కరపత్రాలు అందజేస్తున్న చింతామోహన్

వరదయ్యపాళెం/సత్యవేడు/నాగలాపురం/పిచ్చాటూరు, జనవరి 11: రాష్ట్రాన్ని పరిపాలించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనర్హుడని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. వరదయ్యపాళెం,నాగలాపురం,సత్యవేడు, పిచ్చాటూరుల్లో గురువారం కాంగ్రెస్ నాయకులతో కలసి మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి రాష్ట్రంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమాన్ని తెలియజేస్తూ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్ల పార్టీ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అని ఎద్దేవా చేశారు.మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తేజోవతి, రాజేంద్ర నాయుడు,బాలాజీనాయుడు, రామ్మూర్తినాయుడు, పురుషోత్తం, షేక్‌జావెద్ యుక్తి వర్షిని, సుప్రియ, బిందు, వనమ్మ , చిరంజీవి, ప్రేమ, ముఖేష్, పాండియన్, రవి, జ్ఞానకన్ను, శ్రీనివాసన్, గోవిందస్వామి, దినేష్‌బాబు పాల్గొన్నారు.

టీడీపీ పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడిగా బసవయ్య



బసవయ్యకు నియామక పత్రాన్ని అందిస్తున్న హెలెన్

సత్యవేడు, జనవరి 11: తిరుపతి పార్లమెంట్ టీడీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడిగా కేవీబీ పురం మండలం సదాశివపురం గ్రామానికి చెందిన గుండు బసవయ్య(జాన్ పీటర్) నియమితులయ్యారు. గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జి డా. హెలెన్ సంబంధిత నియామక పత్రాన్ని గుండు బసవయ్యకు అందించారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ అప్పగించిన ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని బసవయ్య తెలిపారు.ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సాధు, శేఖర్, దశరథన్, బాబు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం అమ్మకాలపై దాడులు

శ్రీకాళహస్తి జనవరి 11: అక్రమ మద్యం అమ్మకాలపై పోలీసులు గురువారం దాడులు చేశారు .ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలు

శ్రీకాళహస్తి జనవరి 11: రోడ్డు ప్రమాదంలో జస్విక (8) అనే చిన్నారి గాయపడిన ఘటన శ్రీకాళహస్తిలో గురువారం చోటు చేసుకుంది. మిట్టకండ్రిగ వద్ద జాతీయ రహదారిపై కారు, టెంపో ఢీకొన్న ఘటనలో చిన్నారి గాయపడింది.

మర్రిమందలో గడప గడపకు ప్రభుత్వం

ఏర్పేడు, జనవరి 11: ఏర్పేడు మండలం మర్రిమంద పంచాయతీలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి నిర్వహించారు. వైసీపీ నాయకులు కిషోర్‌రెడ్డి, తిరుమలయ్య, రమణయ్య యాదవ్, నాగార్జునరెడ్డి, బత్తిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు జీతాలు పెంచాలి

శ్రీకాళహస్తి జనవరి 11: అంగన్వాడీలకు ప్రభుత్వం వెంటనే జీతాలు పెంచాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జంగాలపల్లి అన్నపూర్ణమ్మ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

బీజేపీ మీడియా అధికార ప్రతినిధిగా రమణారెడ్డి

శ్రీకాళహస్తి జనవరి 11: బీజేపీ మీడియా అధికార ప్రతినిధిగా అమ్మపాలెం రమణారెడ్డిని నియమించారు. శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షులు బెస్త చంద్రప్ప గురువారం రమణారెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గొబ్బెమ్మ ఉత్సవం



గొబ్బెమ్మ ఉత్సవమూర్తి ఊరేగింపు

శ్రీకాళహస్తి జనవరి 11: ముక్కంటి ఆలయంలో గొబ్బెమ్మ ఉత్సవం ఘనంగా జరిగింది. అలంకార మండపంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గొబ్బెమ్మ ఉత్సవమూర్తిని గురువారం విశేషంగా అలంకరించారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ హరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నైవేద్యం ఆలస్యంపై అభ్యంతరం

శ్రీకాళహస్తి జనవరి 11: ముక్కంటి ఆలయంలో గురుదక్షిణామూర్తి నైవేద్యం ఆలస్యం కావడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆలయంలోని దక్షిణామూర్తికి ప్రతి గురువారం లాగే విశేష అభిషేకాలు నిర్వహించారు. అలంకారం అనంతరం స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించడం వైదిక నియమం. అయితే గురువారం ఓ ప్రముఖ వ్యక్తి కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయన రాక కోసం స్వామివారికి అలంకరణ పూర్తయినప్పటికీ నైవేద్య సమర్పణకు తెర తీయకుండా ఆలస్యం చేశారని విమర్శలు వచ్చాయి. ఈ విషయమై కొందరు భక్తులు సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

స్కిమ్స్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

శ్రీకాళహస్తి జనవరి 11:విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని కమిషనర్ రమేష్ బాబు అన్నారు. శ్రీకాళహస్తి మండలం కాపు గున్నేరులోని స్కిమ్స్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ బాబు మాట్లాడుతూ... విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకమని వివరించారు.కరస్పాండెంట్ మిద్దెల హరి మాట్లాడుతూ... అధ్యాపకుల బోధనలు జీవిత సోపానాలుగా పాటించాలని సూచించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాదేవి, విశ్రాంత ప్రిన్సిపాళ్లు రఘురామరెడ్డి, శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించండి

శ్రీకాళహస్తి జనవరి 11: రైతు భరోసా కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు సూచించారు. తొట్టంబేడు మండలం పెద్ద కన్నలి, చిట్టత్తూరుల్లో రైతు భరోసా కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు.ఈక్రాప్ బుకింగ్ పై ఆరా తీశారు. రైతులకు ఎరువులను సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.వ్యవసాయ శాఖ అధికారులు ధనుంజయ రెడ్డి, రమేష్ రెడ్డి, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



విశేషాలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి జనవరి 11: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఆలయ అర్చకులు ముందుగా గురు దక్షిణామూర్తి సన్నిధిని శుద్ధి చేశారు. శాస్త్రోక్తంగా కలశస్థాపన చేసి భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణకవచాలంకృతంగా అలంకరించారు. పసుపు వర్ణ పూలు, ముడి శనగల దండలను భక్తులు సమర్పించారు. వేదమంత్రాల మధ్య ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

సెక్యూరిటీ గార్డుపై పోలీసులకు ఫిర్యాదు

శ్రీకాళహస్తి జనవరి 11: ముక్కంటి ఆలయ సెక్యూరిటీ గార్డుపై ఈవో రామారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ఆలయంలో సెక్యూరిటీ గార్డు గా పనిచేస్తుంటారు. మహారాష్ట్రకు చెందిన కొందరు భక్తుల నుంచి అడ్డదారిలో దర్శనం చేయిస్తానంటూ నగదు వసూలు చేసినట్లు బాధితులు ఈవోకు ఫిర్యాదు చేశారు. భక్తుల సమక్షంలో ఈవో రామారావు సెక్యూరిటీ గార్డును పిలిచి విచారించారు. అనంతరం సెక్యూరిటీ గార్డుపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాయ మాటలతో బంగారు చైను చోరీ

శ్రీకాళహస్తి జనవరి 11: మాయ మాటలతో నగల దుకాణంలో బంగారు చైను చోరీ చేసిన ఘటన శ్రీకాళహస్తిలో వెలుగు చూసింది.పది రోజుల క్రితం ముత్యాలమ్మ గుడి వీధిలోని ఓ నగల దుకాణంలోకి వెళ్లిన దొంగ వివిధ రకాల మోడల్ చైన్లను చూస్తున్నట్లు మాయమాటలతో నమ్మించాడు. అదమరిచిన సమయంలో 14 గ్రాముల బంగారు చైను అపహరించాడు.ఆలస్యంగా గుర్తించిన నగల దుకాణ నిర్వాహకులు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల కార్మికులతో పని చేయించడం తీవ్ర నేరం

శ్రీకాళహస్తి జనవరి 11: బాల కార్మికులతో పని చేయించడం తీవ్రమైన నేరమని లేబర్ ఇన్‌స్పెక్టర్ రంగనాథ్ అన్నారు. పట్టణంలోని చతుర్మాడ వీధులు, జయరాంరావు వీధిలో గురువారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. మండల న్యాయ సేవ అధికార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 11: మండల కేంద్రంలోని వికాస్ విద్యాసంస్థలో ముందస్తు సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. వికాస్ విద్యాసంస్థల అధినేత పల్లమాల సుధాకర్ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు ఎంఈవో మునిసుబ్రమణ్యం చేతుల మీదగా బహుమతులు అందజేశారు.వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సుధ, ఏవో రాము, ప్రిన్సిపాల్ మనోహర్, హెచ్ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి అహరహం శ్రమించండి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

పిచ్చాటూరు, జనవరి 11: వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం పార్టీ శ్రేణులంతా అహరహం శ్రమించాలని టీడీపీ చెన్నై ఫోరం ఇన్‌చార్జి చంద్రశేఖర్ కోరారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే హేమలత, ఇన్‌చార్జి హెలెన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నుంచి ఎన్ని అవాంతరాలు ఎదురైనా ప్రతిఘటించి ఓటరుకు మనోధైర్యం కల్పిం చాల్సిన అవసరం ఉందన్నారు.

టీడీపీ పరిశీలకుడికి సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న తిరుమలరెడ్డి

పిచ్చాటూరు, జనవరి 11: సత్యవేడు నియోజకవర్గ టీడీపీ అబ్జర్వరు చంద్రశేఖర్‌ను పిచ్చాటూరు టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి గురువారం ఘనంగా సన్మానించారు.పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి జయ హో బీసీ కార్యక్రమానికి కార్యోన్ముఖులు కావాలని సూచించారు.

యువత భవితవ్యం కోసం నేడు ర్యాలీ

శ్రీకాళహస్తి జనవరి 11: యువత భవితవ్యం కోసం శుక్రవారం జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి గురువారం ప్రకటనలో పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి మధ్యాహ్నం 3గంటలకు ర్యాలీ ప్రారంభమై చతుర్మాడ వీధుల్లో సాగనున్నట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా యువత పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

అధ్యాపకులకు ఘన సన్మానం

శ్రీకాళహస్తి జనవరి 11: శ్రీకాళహస్తి ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నలుగురు అధ్యాపకులను సహచర సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు.ఫిజిక్స్ విభాగంలో బాపనయ్య, కంప్యూటర్ సైన్స్‌లో సతీష్ కుమార్, జువాలజీలో తులసి డాక్టరేట్లు పొందారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకులు రవిప్రసాద్‌ను ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నలుగురు అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి డిపాజిట్లు గల్లంతు : చింతా

కేవీబీపురం జనవరి 11: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి డిపాజిట్లు కూడా రావని మాజీ ఎంపీ చింతమోహన్ జోస్యం చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మార్పు రావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. కళత్తూరు, కేవీబీపురం గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. గిరిజనులకు మంజూరైన నిధులను ముఖ్యమంత్రి ఖాతాలోకి మళ్లించుకుని వారికి జగన్ అన్యాయం చేశారని ఆరోపించారు. అందుకు హైకోర్టుకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా, నిరుద్యోగ భృతి, అంగన్వాడీల సమస్యలు తీర్చడం, రైతులకు రుణ మాఫీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామన్నారు.

15న సూర్యనారాయణస్వామి హోమం

వరదయ్యపాళెం, జనవరి 11: మండలంలోని ఏకం ఆశ్రమంలో లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న సూర్యనారాయణ హోమం నిర్వహించనున్నట్లు బొప్పన రమేష్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హోమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాషా, డిల్లీ ప్రకాష్, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెరిందేశంలో ప్రత్యేక పశు వైద్య శిబిరం

కేవీబీపురం జనవరి 11: మండలంలోని పెరిందేశంలో తరచూ పశువుల రోగాలబారిన పడి చనిపోతున్నాయి. అందుకని గురువారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నట్టల నివారణ, గాలికుంటు వ్యాధులకు వ్యాక్సిన్ వేశారు. పశు వైద్యాధికారి శేఖర్, నాగవలి, కోవనూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపాళ్లకు సత్కారం



శ్రీకాళహస్తి జనవరి 11: విద్యాలయం ప్రతి ఒక్కరికీ పునర్జన్మ నిచ్చే కేంద్రమని విశ్రాంత ప్రిన్సిపాళ్లు రాధయ్య, సుకుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఇందులో భాగంగా ఇక్కడే చదివి అనంతరం ప్రిన్సిపాల్‌గా సేవలందించిన రాజయ్యను, సుకుమార్ రెడ్డిని సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం రాధయ్య కళాశాల అభివృద్ధికి రూ.10వేలనగదును విరాళంగా అందజేశారు.వైస్ ప్రిన్సిపాల్ మురళి, అధ్యాపకుడు రాజేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సమాయత్తంకండి

- నాయకులకు, కార్యకర్తలకు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ పిలుపు



బీఎన్‌కండ్రిగ సమావేశంలో మాట్లాడుతున్న హెలెన్

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 11: సార్వత్రిక ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ పిలుపునిచ్చారు. బుచ్చినాయుడు కండ్రిగ లో గురువారం మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమానికి ప్రజల్లో మంచి స్పందన వస్తుందన్నారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతు ఇవ్వాలన్నారు. టీడీపీ ప్రకటించిన ఆరు పథకాలతో పాటు వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలనూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని నియోజకవర్గ పరిశీలకుడు చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. జగన్ అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలు నిర్వీర్యమైనట్లు మాజీ ఎమ్మెల్యే హేమలత విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, మేదర కార్పొరేషన్ మాజీ చైర్మన్ సుందరయ్య, ఎంపీటీసీ మనోహర్‌నాయుడు, నాయకులు మునెయ్య నాయుడు, వెంకటచలం, ఉషారాణి, రవినాయుడు, వీరరాఘవులు, రవినాయుడు, మునిరాజ, శేషయ్య, భాస్కర్ యాదవ్, రమణయ్య యాదవ్, మునిసుబ్బయ్య, మధు నాయుడు, నరసింహులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ రాజన్‌కు ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి, జనవరి 11: టీడీపీ నేత సి.ఆర్.రాజన్‌కు మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు ప్రవీణ్ ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. సి.ఆర్.రాజన్ జన్మదిన వేడుక గురువారం ఘనంగా జరిగింది. టీడీపీ నాయకులు నాగభూషణ నాయుడు, మునిశేఖర్ గౌడ్, లోకనాథం రాయల్, లీలా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా



నాగలాపురం మండలానికి చెందిన రాయల్టీ బిల్లు

వరదయ్యపాళెం, జనవరి 11: వరదయ్యపాళెం మండలంలో గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. వీరంతా అధికార పార్టీ నేతల అనుచరులు కావడంతో అధికారులు చూసీచూడకుండా ఉన్నారనే విమర్శలున్నాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బత్తలవల్లం పంచాయతీ చెదులపాకం శివారులో గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతోంది. ఇక్కడ టిప్పరు గ్రావెల్ రూ.13 వేలు కాగా.. చెన్నైలో రూ.35వేలు. దీంతో సత్యవేడు, నాగలాపురం మండలాలకు చెందిన పర్మిషన్ రాయల్టీ బిల్లులతో ట్రిప్‌షీట్‌ను తాత్కాలిక రసీదులతో గ్రావెల్ తరలిస్తున్నారు. అధికార పార్టీ అండదండలతో ఈ అక్రమ రవాణా సాగుతోంది. దీంతో సంబంధిత శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రైవేటు రాయల్టీ వ్యక్తులు చెక్‌పోస్టుల వద్ద తూతూమంత్రంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బెటాలియన్ అభివృద్ధికి కృషి



క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న అదనపు డీజీపీ అతుల్ సింగ్

వెంకటగిరిటౌన్, జనవరి 11: 9వ బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తామని ఏపీఎస్పీ అడిషనల్ డీజీపీ అతుల్ సింగ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక 9వ బెటాలియన్‌ను ఆయన సందర్శించారు. బెటాలియన్‌లోని క్యాంటీన్, టైలరింగ్ సెంటర్, గ్యాస్ ఆఫీస్, ప్రొవిజనల్ స్టోర్, ఆస్పత్రి, క్వార్టర్స్‌ను పరిశీలించారు. అనంతరం దర్బార్ నిర్వహించి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదోన్నతులు, బదిలీల విషయమై సిబ్బంది వినతిపత్రం అందించారు. బెటాలియన్ సిబ్బంది క్రమశిక్షణతో మెలుగుతున్నారని కమాండెంట్ ప్రకాష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ ప్రకాష్, అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్, అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎల్ మనోహర్, ఆనంద్ కన్నా, ఏవో చంద్రమౌళి, డాక్టర్ శేషమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయం



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, జనవరి 11: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం గూడూరు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదని, ఉన్న పరిశ్రమలు కూడా వైసీపీ నాయకుల అవినీతిని తట్టుకోలేక పక్కరాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. యువత నిరుద్యోగులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలు ఇసుక, సిలికా, మైనింగ్‌తో లక్షల కోట్లు దోపిడీ చేశారన్నారు. భూహక్కు చట్టం అమలైతే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయం సాధించడం తథ్యమన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, నటశేఖర్, సునీల్, చందు, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమ్మె కొనసాగింపు



మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

వెంకటగిరి, జనవరి 11: తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న కార్మికులు గురువారం విధుల్లోకి వచ్చారు. అయితే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్, వాటర్ వర్కర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు 9వ రోజు కూడా తమ నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరు జాన్ మాట్లాడుతూ తాము సమ్మె చేస్తున్న శిబిరం వద్దకు వచ్చిన మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్యను తమకు బకాయి ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లిస్తే సమ్మెను విరమిస్తామని చెప్పామన్నారు. ఆయన తమపై ఆగ్రహం వ్యక్తం చేయడం తగదన్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బాలాజీ, శ్రీనివాసులు, కందప్ప, శేఖర్, నరేష్, చక్రి, నాగేశ్వరావు, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రోటవర్ కాలనీలో ఇంటింటికీ టీడీపీ



మైక్రోటవర్ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 11: మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీలో గల మైక్రోటవర్ కాలనీలో గురువారం ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం జరిగింది. ఆ పార్టీ నాయకులు ఇంటింటా తిరిగి మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పాశిం సునీల్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకొని అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జలీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సుధీర్‌రెడ్డి, అనూక్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య నీళ్లు నిల్వలేకుండా చూడండి



పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

బాలాయపల్లి, జనవరి 11: బాలాయపల్లి గిరిజన కాలనీలో ఇళ్ల మధ్య నీళ్ల నిల్వ చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని సుబ్రహ్మణ్యం గ్రామం నుంచి బాలాయపల్లికి తాగునీటి పైప్‌లైన్ ఉంది. మధ్యలో గిరిజన కాలనీ వద్ద ఎయిర్ పైప్ పెట్టారు. అందులో నుంచి నిరంతరం నీళ్లు వస్తూనే ఉన్నాయి. అవన్నీ బాలాయపల్లి గిరిజన కాలనీ ఇళ్ల మధ్య నిల్వ చేరడంతో పరిసరాలు దుర్గంధం భరితంగా మారాయి. అలాగే దోమల ప్రభావంతో రాత్రిపూట స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని, మండల అధికారులు చొరవ తీసుకుని ఇళ్ల మధ్య నీళ్లు నిల్వ లేకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హిందూ, ముస్లిలు ఐక్యంగా ఉండాలి

గూడూరు, జనవరి 11: హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉండాలని జైభారత్ సంస్థ జాతీయ కార్యదర్శి లోకనాథ్ అన్నారు. గురువారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో హిందూ, ముస్లింల ఐక్యతపై జైహో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతసామరస్యాన్ని కాపాడేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉంటూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో వీరయ్య, భాస్కర్‌గౌడ్, అన్వర్‌బాషా, మహేష్, నాగమణి, నాగరాజు, మహేష్, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



చెంచయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

నాయుడుపేట టౌన్, జనవరి 11: విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని చిగురుపాడులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.... చిగురుపాడు గ్రామానికి చెందిన చెంచయ్య(50) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం కూలి పని నిమిత్తం పంట పొలాల్లోకి వెళ్లాడు. ఓ రైతు పొలం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తీగలు తగలడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. సీఐ నరసింహారావు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

కోట, జనవరి 11: మండల పరిధిలోని కర్లపూడిలో గురువారం కోడి పందేల స్థావరంపై ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. ముగ్గురు జూదర్లను అదుపులోకి తీసుకొని రెండు కోడి పుంజులు, రూ.3,100 నగదు స్వాధీనం చేసుకున్నారు.





నాయుడుపేటలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద భిక్షాటన చేస్తూ అంగన్వాడీల నిరసన - సూళ్లూరుపేటలో పొర్లు దండాలు

హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వానికి అధోగతే

చిల్లకూరు, జనవరి 11: అంగన్వాడీలకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వైసీపీ ప్రభుత్వానికి అధోగతి తప్పదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి అన్నారు. గురువారం గూడూరు గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన సమస్యల కోసం అంగన్వాడీలు నెలరోజులకు పైగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నా పట్టించుకోని సీఎం జగన్ ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం మంచి పద్ధతికాదన్నారు. వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వుంటుందన్నారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, ఇంద్రావతి, ప్రభావతి, శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, గోపినాథ్, శ్రీనివాసులు, ప్రసాద్, రమణయ్య, చంద్రయ్య, పెంచలమ్మ, మునికుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 31 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీలు గురువారం సీఐటీయూ నాయకులతో కలిసి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, సంఘ నాయకులు కళావతి, నాగమ్మ, చెంగమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: ప్రభుత్వం అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు ఇస్తే భయపడేదిలేదని సీఐటీయూ నాయకుడు పద్మనాభయ్య స్పష్టం చేశారు. అంగన్వాడీలు సమ్మెలో భాగంగా గురువారం స్థానిక హోలీక్రాస్ కూడలి వద్ద జాతీయ రహదారి పక్కన నిరసన తెలిపారు. వారికి సీఐటీయూ, యుటీఎఫ్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పద్మనాభయ్య మాట్లాడుతూ అంగన్వాడీలు నెల రోజులుగా సమ్మె చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇచ్చి భయపెట్టాలని చూడడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలు పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను అంగీకరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్వాడీలు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అల్లెయ్య, లక్ష్మయ్య, సాంబశివయ్య, యుటీఎఫ్ నాయకులు ప్రభాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: బంగారుపేట వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న రిలే దీక్ష గురువారం 31వ రోజు కొనసాగింది. తమ సమస్యలను పరిష్కరించే వరకు దీక్ష విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్వరూపారాణి, మంజుల, సుభాషిణి, మమ్ములాబేగం, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కోట: న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేద్దామని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న దీక్షకు యూటీఎఫ్ నాయకులు గురువారం సంఘీభావం తెలిపారు. యూనియన్ తరపున అంగన్వాడీలకు రూ.15వేల చెక్కు అందజేశారు. అనంతరం సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను కలసి రూ.10వేలు అందజేశారు.

వైసీపీ అరాచకాలను వడ్డీతో సహా చెల్లిస్తాం: కురుగొండ్ల



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, జనవరి 11: వైసీపీ అరాచకాలను గుర్తుపెట్టుకోని టీడీపీ అధికారంలోకి రాగానే వడ్డీతో సహ చెల్లిస్తామని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. గురువారం ఆయన డక్కిలి మండలంలోని దేవునివెల్లంపల్లిలో ఇటీవల వైసీపీ నేతల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు ఏలశ్వరం శంకరయ్య, గౌరీలను పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార మదంతో వైసీపీ నేతలు టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. అకారణంగా టీడీపీ నాయకులకు చెందిన ఆస్తులకు నష్టం కలిగిస్తూ దౌర్జన్యాలకు దిగుతున్నారని, అటువంటి వారందరికీ అధికారంలోకి తగిన సమాధానం చెప్తామని హెచ్చరించారు. ఇటీవల అక్రమ మైనింగ్‌పై దీక్ష చేపట్టిన మాజీ మంత్రి సోమిరెడ్డిని అడ్డు కొనేందుకు హిజ్రాలను పంపడం సిగ్గుచేటన్నారు. టీడీపీ పాలనలో హిజ్రాలను గౌరవించి వారికి పింఛను అందిస్తే వారిని వైసీపీ నేతల అరాచకాలకు పావుగా వాడుకోవడం దుర్మార్గమని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వం రైతుల సాగునీటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోని మంజూరు చేసిన ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపియేడం అన్యాయమన్నారు. ఖనిజ సంపద సరిపోదన్నట్లు వైసీపీ నేతలు గంజాయి, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలనే ఉపాధి అవకాశాలుగా ఎంచుకోని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు దేవునివెల్లంపల్లిలో వైసీపీ మద్దతుతో ఎన్నికైన దేవునవెల్లంపల్లి పంచాయతీ ఉపసర్పంచు నరసయ్య మాజీ ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం డక్కిలిలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు దందవోలు రత్నాకర రెడ్డిని రామకృష్ణ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యదర్శి పులికొల్లు రాజేశ్వరరావు, మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, ఆస్పత్రి సలహామండలి మాజీ చైర్మన్ చెలికం భాస్కరరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వైసీపీ నేతలు



ఇసుక తరలిస్తున్న వాహనాలను అడ్డుకుంటున్న వైసీపీ నాయకులు

చిట్టమూరు, జనరరి 11: మడల పరిధిలోని మెట్టు స్వర్ణముఖి నది వద్ద గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. ఇసుక రవాణాకు ఈ నెల 9వ తేదీతో అనుమతి ముగిసిపోయినా అక్రమంగా తరలిస్తుండడంతో వైసీపీ నాయకులు, రైతులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా తరలిస్తారని నిలదీశారు. తమకు అనుమతి ఉందంటూ ఇసుకాసురులు బుకాయించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. నదిలో నుంచి రహదారి వైపు దారులకు అడ్డంగా వైసీపీ నాయకులు గాడి తీయించారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

కోట, జనవరి 11: మండల పరిధిలోని గూడలిలో గురువారం రాత్రి అయోధ్య రామచంద్రుడి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అర్చక సలహా మండలి సభ్యుడు దివి అనంతబాబు, సమరసత సేవాసంస్థ జిల్లా కన్వీనర్ కొండూరు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా స్వామివారి అనుగ్రహం పొందడానికి బాలరాముడికి అర్చన చేసిన అక్షింతలను ప్రతి ఇంటికీ చేరాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కోన సాయిబాబా, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిట్టేడులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

కోట, జనవరి 11: మండల పరిధిలోని చిట్టేడు, ఊనుగుంటపాళెం గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పారిచర్ల భైరప్ప, మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు ఆధ్వర్యంలో పలువురు అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భవానీ, ఏపీఎం రత్నయ్య, పంచాయతీ కార్యదర్శులు సుమలత, రాఘవరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణను వేగవంతం చేయండి

కోట, జనవరి 11: విధి నిర్వహణను వేగవంతం చేసి ఆదర్శంగా నిలవాలని మండల ఎంఈవోలు శైలజ, మస్తానయ్య కోరారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు సమ్మె విరమణ తరువాత సమీక్షించారు. ప్రధానంగా క్లస్టర్ మొబైల్ టీచర్స్‌కు విధుల నిర్వహణ, విద్యాబోధన తదితర అంశాలపై ఎంఈవోలు అవగాహన కల్పించారు.



టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుచానూరు మాజీ సర్పంచు సీఆర్ రాజన్ జన్మదినం సందర్భంగా గజమాలతో శుభాకాంక్షలు తెలుపుతున్న కిషోర్‌రెడ్డి, హరిరామ్‌రెడ్డి, సాయి రాయల్

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయండి

గూడూరు, జనవరి 11: విజయవాడలో ఈనెల 19వ తేదీన జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు నియోజకవర్గంలోని ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గురువారం స్థానిక సొసైటీకాలనీలోని ఎమ్మెల్యే నివాసం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులకు ఆరాధ్య దైవమైన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ విజయవాడలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో మన్నెం శీనయ్య, నరసయ్య, సతీష్‌రెడ్డి, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



కళాశాలకు కుర్చీలు అందజేస్తున్న ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రసాద్

నాయుడుపేట, జనవరి 11: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రసాద్ అన్నారు. గురువారం పెసల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ వ్యాపార రంగంలోనే కాకుండా సామాజిక సేవల్లోనూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురవయ్య, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఆశీష్‌కుమార్, సిబ్బంది హేమంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, శంకర్, వంశీ, కృష్ణారెడ్డి, మునికుమార్, తదితరులు పాల్గొన్నారు.

13వ వార్డులో గడపగడపకు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జనవరి 11: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. కార్యక్రమంలో రాజా కుటుంబీకులు సర్వజ్ఞ యాచేంద్ర, కౌన్సిలర్లు కాసా కృష్ణమూర్తి, వహీదా, ఆరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

చిల్లకూరు, జనవరి 11: సంక్రాంతి పండుగల నేపథ్యంలో గూడూరు పట్టణంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ పారిశుధ్య కార్మికులకు సూచించారు. కార్మికులు సమ్మె విరమించుకుని విధుల్లో చేరడంతో గురువారం పట్టణంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను దేవసేనమ్మ పరిశీలించి సిబ్బంది సూచనలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయి

వెంకటగిరి, జనవరి 11: ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్ పాలనతో విసిగి వేసారిన ప్రజలు ఆయన్ను ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని, చంద్రబాబు నిర్వహిస్తున్న రా.. కదలిరా.. సభలకు వస్తున్న జనమే ఇందుకు నిదర్శనమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు 31 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సబబుకాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు జగన్ చేసే ప్రయత్నాలు సఫలం కావని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో వెంకటగిరి నుంచి తాను అత్యధిక మెజారిటీతో గెలుస్తానని దీమా వ్యక్తం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవి చెంద్ర జన్మదినాన్ని పురష్కరించుకొని కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు తోటా కృష్ణయ్య, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధనాయుడు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, తాండవ చంద్రారెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, మల్లారం బాబు, గల్లా శ్రీనివాసులు, సుధ, రవి, గంగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు

450 మంది అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు

కోట, జనవరి 11: కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 225 అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 450 మంది వర్కర్లు, హెల్పర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు సీడీపీవో మునికుమారి గురువారం తెలిపారు. ఎస్మా ప్రయోగించినందు వల్ల వెంటనే విధులకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు సీడీపీవో తెలిపారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోండి: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న కందల కృష్ణారెడ్డి

నాయుడుపేట టౌన్, జనవరి 11: పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అధికారులు తక్షణమే అడ్డుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ పాత బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టారని, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతూభయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌కు ఎన్ని పర్యాయాలు వినతిపత్రం అందజేసినా అక్రమ కట్టడాలను అడ్డుకోవడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను అడ్డుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సులేమాన్, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న ఎంపీడీవో రజనీకాంత్

ఓజిలి, జనవరి 11: ఓజిలి మండలం పెద్దపరియలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా అర్హులైన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో రజనీకాంత్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు సిలెండర్‌తో పాటు స్టౌ అందజేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు ముమ్మడి సుబ్బారావు, బీజేపీ మండల కన్వీనరు ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

క్రీడలు జీవన విధానంలో భాగం కావాలి

వెంకటగిరి టౌన్, జనవరి 11: మానవుడి జీవన విధానంలో క్రీడలు భాగం కావాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం... ఆంధ్ర మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, పీఈటీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు